

సైన్స్ సెంటర్‌ను సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని రాజాట్యాంక్ పార్కు ఆవరణలో రూ.15కోట్ల వ్యయంతో నిర్మాణం అవుతున్న సైన్స్ సెంటర్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ ఎస్ఇ పి.వెంకటరావు నిర్మాణ ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు, మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ రకాల ఎగ్జిబిషన్ల నిర్వహణ, ఇతర వైజ్ఞానిక అంశాల కోసం ఈ సైన్స్ సెంటర్ నిర్మాణమవుతోందన్నారు. నిర్మాణ పనులు, టెండర్ ప్రక్రియలను మరింత వేగవంతం చేసి త్వరగా వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిమిషం ఆలస్యమైనా ఇంటికే...

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- జిల్లాలో 59 కేంద్రాలు సిద్ధం
- పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండానే విద్యాసంవత్సరం ముగింపు


కాకినాడ పిఆర్ కళాశాలలో సిద్ధంగా ఉన్న పరీక్ష గది

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఇంటర్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ బోర్డ్ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ నెల ఒకటి నుంచి 20వ తేదీద వరకూ థీరీ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు మాస్ కాపీయింగ్ కు చెక్ పెట్టే విధంగా పరీక్ష జరిగే ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతి లేదని అధికారులు తెలిపారు. కాకినాడ జిల్లాలో 59 కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు మొత్తం 44,179 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలల్లో జనరల్, ఒకేషనల్ కలిపి ప్రథమ సంవత్సరం 22,059 మంది, ద్వితీయ సంవత్సరం 22,120 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఇంటర్ ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. కాకినాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేపర్లు భద్రంగా ఉన్నాయి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ నిబంధనను కూడా అమలు చేయనున్నారు. పరీక్షల్లో విద్యార్థులు ఇబ్బందులు, ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే విద్యార్థుల హాల్ టికెట్లను ఆన్‌లైన్ లో ఉంచారు. వీటిని డౌన్లోడ్ చేసుకుని నేరుగా పరీక్షలకు హాజరయ్యే అవకాశాన్ని కల్పించారు. గతంలో మాదిరిగా హాల్ టికెట్లు కోసం కళాశాలల చుట్టూ తిరగాల్సిన అవసరం ఇక ఉండదు. విద్యార్థి ఇచ్చిన ఫోన్ నంబరు పరీక్ష కేంద్రం పేరుతోపాటు గది నంబర్ వివరాలను మెసేజ్ రూపంలో పంపారు.

నిఘా నీడన

పరీక్షలు జరగనున్న అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించే ప్రతి గదిలో సిసి కెమెరాలను బిగించాలని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ఆదేశించారు. సిసి కెమెరాల ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ జరిగితే సిసి కెమెరాల లైవ్ ద్వారా అధికారులు వెంటనే గుర్తించేందుకు అవకాశం ఉంది.

జంబ్లింగ్ ద్వారా ఇన్‌విజిలేటర్లు

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ ద్వారా నియమించనున్నారు. పరీక్ష జరగనున్న కళాశాలలో అదే కళాశాలకు చెందిన ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది ఎవరూ విధులు నిర్వర్తించే అవకాశం ఉండదు. ఇన్విజిలేటర్లు రోజురోజుకు మారుతుంటారు. పరీక్షలకు 59 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 59 మంది డిపార్ట్మెంటల్ అధికారులను నియమించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షణ ఉంటుంది. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధ్యాపకులతో టాస్క్ ఫోర్స్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. వీరితోపాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లు నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఒక్కో పరీక్షా కేంద్రంలో 20 నుంచి 25 మంది వరకూ ఇన్విజిలేటర్లు ఉంటారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలు సమీప పోలీసు స్టేషన్లకు చేరుకోగా అక్కడి నుంచి ఏ రోజుకారోజు పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రాలను కేంద్రానికి తీసుకెళ్లనున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై ఇప్పటికే జిల్లా అధికారులు సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలని, అధికారులు, విద్యార్థుల ప్రయాణించే బస్సులకు టోల్ గేట్ లేకుండా చూడాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు తప్పకుండా ఉండాలన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసులకు ఆదేశించారు.

అరాకొరగా పాఠ్యపుస్తకాలు

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అరాకొరగానే అందాయి. సిలబస్‌లో మార్పుల పేరుతో ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలను అందించిన పరిస్థితి లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో 14 చోట్ల ప్లస్ టూ ఇంటర్ కళాశాలలను ప్రారంభించారు. అందుబాటులో ఉన్న అరకొర పుస్తకాలను ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోగా కొందరు బయట కొనుగోలు చేసి చదువుకున్నారు. స్తోమత లేని చాలామంది విద్యార్థులు పుస్తకాలను కొనుగోలు చేయలేక పక్క విద్యార్థుల వద్ద జిరాక్స్ తీయించుకుని చదువుకుని పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఉత్తీర్ణతా శాతంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఏర్పాట్లు పూర్తి



ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేలా ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌కు ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులు అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు అవసరమైన బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతులను కల్పించేందుకు ఏర్పాట్లు చేశాం..

-జిజికె.నూకరాజు, డిఐఇఒ, కాకినాడ


చలో కలెక్టరేట్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు

సంక్షేమ పథకాలకు మంగళం

-భవన నిర్మాణ కార్మికులకు వైసిపి సర్కారు అన్యాయం
-సమస్యల పరిష్కారానికి నేడు 'చలో కలక్టరేట్'

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలో వైసిపి పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోంది. కాకినాడ జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మంది భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారు. వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అరకొరగానే అందిస్తోంది. సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారీతిన ఇతర అవసరాలకు దారి మళ్లించి బిల్డింగ్ వర్కర్లకు అన్యాయం చేసింది. అనేకసార్లు విన్నవించినప్పటికీ పట్టనట్లు వ్యవహరించింది. ఆందోళనలు చేపట్టినా కనీస స్పందన లేదు. ఈ నేపథ్యంలోనే సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, 1214 మెమో రద్దు చేయాలని, 2019 నుంచి పెండింగ్‌లో పెట్టిన క్లెయిమ్‌ల పరిహారాలను కార్మికుల ఖాతాలకు తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులంతా శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణ రంగంలో 53 రకాల పనులు చేస్తున్న కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు దూరం

రాష్ట్ర ప్రభుత్వం భవన కార్మికుల సంక్షేమ పథకాలు నిలుపుదల చేయడం కారణంగా కార్మికులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఆవేదన, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు ఏ ప్రమాదం జరిగినా వారు, పిల్లలకు వివాహం అయినా సంక్షేమ బోర్డు ద్వారా ప్రభుత్వం పథకాలతో సంబంధం లేకుండా పథకాలు అందేవి. కాని ప్రస్తుతం ప్రభుత్వం పథకాలు ఇస్తున్నామనే పేరుతో సంక్షేమ బోర్డు నుంచి సాయం నిలివేశారు. 100 మంది ఉంటే వారిలో 5 నుంచి 10 మందికి మాత్రమే ప్రభుత్వం పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. మిగిలిన వారికి ఎటువంటి లబ్ధి చేకూరట్లేదు. దీంతో కార్మికులు రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారు. మళ్లీ జగన్ వస్తే తమకు ఉపాధి లేకుండా పోయే పరిస్థితులు ఉంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకాల అమలు కాకపోతే భవన కార్మికులు ఓట్లు వేయడానికి సిద్ధంగా లేరు. సామాన్యులు భవంతులు కట్టుకుంటేనే కార్మికులకు ఉపాధి చేతి నిండా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ లోన్ ద్వారా సామాన్యులు తమ సొంత భవనాలు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. కావునా రాష్ట్ర ప్రభుత్వం ఆ విధంగా సహకారం అందించడం ద్వారా ఉపాధి ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల జీవితాలు చీకటిలోకి జారుకున్నాయని, ప్రభుత్వమే సష్టించిన ఇప్పటికే ఇసుక సంక్షోభం, కరోనా సంక్షోభం నిర్మాణ రంగాన్ని కుదేలు చేయగా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ తీరుతో మరింత అంధకారంలోకి కూరుకుపోయారు. ఈనేపథ్యంలోనే మరోసారి ఆందోళనకు సిద్ధ పడ్డారు.


ప్రచారరథంపై మాట్లాడుతున్న చినరాజప్ప

జెండా సభతో తాడేపల్లిలో వణుకు

ప్రజాశక్తి - సామర్లకోట

టిడిపి-జనసేన ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభ తాడేపల్లిలో వణికుపుట్టించిందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలో మెహర్ కాంప్లెక్స్‌లోని లక్ష్మి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గురువారం ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గణపతి నగరం, మెహర్ కంప్లెక్స్ ప్రాంతాల్లో ఆయన ప్రచారన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ఉమ్మడి జెండా సభా విజయవంతం అయ్యిందని, సభకు వచ్చిన లక్షలాదిమంది ప్రజలను చూసి వైసిపి వెన్నులో వణుకు మొదలైయ్యిందని అన్నారు. నియోజక అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తనయుడు నిమ్మకాయల రంగనాగ్, పార్టీ నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్, గుమ్మళ్ళ రామకృష్ణ, రాజా సూరిబాబు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం సాగునీరు పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

రబీ సీజన్‌లో ప్రణాళికబద్ధంగా సాగునీరు పంపిణీ చేపట్టి, శివారు భూములకు సాగునీరు నీటి ఎద్దడి లేకుండా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో రబీ సీజన్ లో సాగునీరు పంపిణీ ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ కతికా శుక్లా రెవిన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో రబీ సాగుపై సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లాలో గోదావరి, ఏలేరు, పంపా రిజర్వాయర్ ఆయకట్ల కింద సాగవుతున్న పంటల వివరాలు, సాగునీరు లభ్యత, కాలువల పరిస్థితులను కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. సాగు నీటి పంపిణీ, నియంత్రణలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి రానున్న రెండు నెలలు అత్యంత కీలకమని ఇరిగేషన్, వ్యవసాయ అధికారుల ప్రణాళిక ప్రకారం పని చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఇందుకు రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో గోదావరి ఆయకట్టు కింద-1.35 లక్షల ఎకరాలు, ఏలేరు ఆయకట్టు కింద- 53 వేల ఎకరాల, పంపా రిజర్వాయర్ కింద సుమారుగా 10 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నూరు శాతం ఈ -క్రాప్ బుకింగ్ పూర్తయిందని, రైతుల నుంచి ఈ-కెవైసి కూడా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలైన తొండంగి, పిఠాపురం, గొల్లప్రోలు, తాళ్లరేవు, పెదపూడి మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండా అనధికారంగా సాగునీరు వినియోగించడాన్ని నివారించా లన్నారు. ఇందుకు మండల, గ్రామస్థాయిలో వ్యవసాయం, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు, జిల్లా వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్, ధవళేశ్వరం నీటిపారుదల శాఖ ఎస్ఇ జి.శ్రీనివాసరావు, పెద్దాపురం ఇఇ డి.రామ్‌గోపాల్, పెద్దాపురం, కాకినాడ డిఇలు కె.నరేష్, ఎ.రవి, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక పంచాయతీలోని స్మశాన వాటికకు వెళ్లేందుకు రూ.5 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్ పనులకు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినిదేవి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాళ్లరేవు ప్రజలు పడుతున్న ఇబ్బందిని గుర్తించి సిసి రోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సిసి రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డిబాబు, వార్డ్ మెంబర్ కుడుపూడి దేవి, పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ, సచివా లయం సెక్రటరీ మేడిశెట్టి వేణు గోపాల్ స్వామి, వైసిపి నాయకులు ఆకుల వెంకన్న, బొంతు వీరమోహన్, తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ అరుణ

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట బ్రౌన్ పేట ట్రూ గాస్పెల్ చర్చిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ట్రూ గాస్పెల్ చర్చి, ట్రూ గాస్పెల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రెవ. డాక్టర్ ఈలి సత్య సువార్త రాజు, షారోన్ సువార్త రాజుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచిత నేత్ర శిబిరాన్ని నిర్వహించారు. తొలుత శిభిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజేస్ ప్రారంభించారు. పిఠాపురం సిఎంసి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిభిరంలో నేత్ర వైద్యులు, సిబ్బంది పాల్గొని పరీక్షలు జరిపారు. 250 మందికి పరీక్షలు జరిపి వారిలో 25 మందిని ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారికి పిఠాపురం సిఎంసి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయనున్నట్టు డాక్టర్ సువార్తరాజు తెలిపారు. ఈ శిబిరంలో చర్చి నాయకులు, సిఎంసి వైద్య సిబ్బంది, యువత పాల్గొని సేవల నందించారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చంద్రమౌళికి డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి



సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో మేథమటిక్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవ లందిస్తున్న ప్రొఫెసర్ జి.బాలచంద్రమౌళి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ జెఎన్‌టియుకె నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ అస్సాం సిల్చార్ ఎన్ఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలం దిస్తున్న డాక్టర్ బి.హేమ సుందర్ రాజు నేతృత్వంలో, ఒంగోల్ ఎఎన్ యు క్యాంపస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గంగాధర్ సహకారంతో చంద్రమౌళి తాను సమర్పించిన 'డబల్ డిఫ్యూసన్ ఎఫెక్ట్ ఆన్ కన్విక్షన్ హీట్అండ్ మాస్ ట్రాన్స్ఫర్ పాస్ట్ ఏ స్ట్రేచింగ్ సర్ఫేస్' అనే అంశంపై సమర్పించిన థీసిస్‌కు ఈ డాక్టరేట్ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్. డోలా సంజయ్, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు ఆయనను అభినందించారు.

రౌతులపూడిలో గడప గడపకూ వైసిపి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడిలో గడప గడపకూ వైసిపి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు, కాకినాడ పార్లమెంటు నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ చలమలశెట్టి సునీల్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు, భాస్కర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటా ప్రచారంలో వరుపుల, చలమలశెట్టి

పెండింగ్ డిఎ విడుదలకు అంగీకారం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవ స్థానం ఉద్యోగుల సంబంధించిన 2021-22 పెండింగ్ డిఎ ఎరి యర్స్ విడుదల చేసేందుకు ఇఒ కె.రామ చంద్రమోహన్ అంగీకరించినట్లు ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు బిఎస్ఎన్. రాజు తెలిపారు. రెండు రోజులు కిందట ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా గురువారం అధ్యక్షులు రాజు తన కార్యవర్గ సభ్యులతో ఇఒ కె.రామచంద్ర మోహన్ మరియు చైర్మన్ ఐవి.రోహిత్‌ను కలిసి వారిరువురిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పెండింగ్ డిఎ ఎరియర్స్ అంశాన్ని వారికి వివరించారు. దీంతో ఉద్యోగుల డిఎ ఎరియర్స్‌ను చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించినట్లు రాజు తెలిపారు.


ఇఒను సత్కరిస్తున్న నూతన కార్యవర్గం ప్రతినిధులు

సత్యప్రభను కలిసిన సానా సతీష్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభను ప్రముఖ పారిశ్రామికవేత్త సానా సతీష్ ఆమె స్వగృహంలో కలిశారు. సతీష్ వచ్చే ఎన్నికల్లో కాకినాడ పార్లమెంటుకు పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో గురువారం సత్యప్రభ నివాసానికి చేరుకుని కలవడంతో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, శంఖవరం, ఏలేశ్వరం మండల టిడిపి అధ్యక్షులు బద్ది రామారావు, సూతి బూరయ్య, ఎంపిటిసి సభ్యులు కొప్పుల బాబ్జి, నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్ పాల్గొన్నారు.


సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిసిన సానా సతీష్

కార్టూ'నిజం'



మీరు ఎగ్గొట్టినా.. బడా నేతల జాబితాలోకి రారులెండీ!!!

చందుర్తి విద్యార్థికి ప్రథమ స్థానం



బహుమతిని అందుకుంటున్న విద్యార్థి

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురంలో జరిగిన సైన్స్ ఫెయిర్-2024లో గొల్లప్రోలు మండలం చందుర్తిలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న జి.శ్రీసురేంద్రలక్ష్మణ్‌కు ప్రథమ బహుమతి లభించింది. ప్రముఖ పారిశ్రామిక వేత్త మొరాల చిట్టి సునీల్‌కుమార్ పిఠాపురం డివిజన్ స్థాయిలో ఈ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. 35 ప్రాజెక్టులు రాగా వాటిలో ప్రథమ బహుమతి చెందుర్తి పాఠశాల ప్రాజెక్టుకు మొదటి స్థానం దక్కింది. ప్రథమ బహుమతిగా లెనోవా ల్యాప్‌ట్యాప్, బంగారు పతకాన్ని అందించారు. విద్యార్థి లక్ష్మణ్‌ను, తర్ఫీదునిచ్చాని మాస్టర్ పిల్లి గోవిందరాజులును ఎంఇఒలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్ఎం ఎస్.సురేష్‌కుమార్, పిఎంసి చైర్మన్ కె.రామకృష్ణ, సర్పంచ్ అల్లిపాప నూకరాజు, ఉప సర్పంచ్ కోనేటి పెదబాబు, ఎంపిటిసి సభ్యులు బత్తిన మంగయమ్మ అభినందించారు.

ప్రతీ కుటుంబానికి రూ.1.20 లక్షల సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి - జనసేన కూటమి ప్రభుత్వంలో ప్రతి ఏటా ప్రతి కుటుంబానికి రూ.1.20 లక్షలు సాయా న్ని అందిస్తామని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల శంఖారావం పేరుతో నియోజక వర్గంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి కూటమి పాలనలో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పార్టీలో చేరేందుకు ఎవరు ముందుకు వచ్చినా చేర్చుకునేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల ప్రచారం ఏ విధంగా చేపట్టాలి, ప్రజల వద్దకు ఎలా వెళ్లాలి, నోటిఫికేషన్ ముందు, నోటిఫికేషన్ తర్వాత ప్రచారం చేసే తీరును వివరించారు. టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని, అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. గ్రామాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలను కలుపుకుని సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. మార్చి 5వ తేదీ వరకు ఎన్నికల ప్రచారం వార్డుల వారీగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రాజా సూరిబాబు రాజు, కాకినాడ రామారావు,కొత్తిం వెంకట శ్రీనివాసరావు(కోటి), తోటకూర శ్రీనివాస్, నిమ్మకాయల రంగనాగ్, అడబాల కుమార్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

నేరాలు ఘోరాలు

వేధిస్తున్న భర్త పై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ తరచూ భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన వీరమల్ల పద్మావతికి రెండేళ్ల క్రితం తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన వీరమల్ల మహేష్ నారాయణతో వివాహమైంది. అప్పట్లో కట్న కానుకలు, ఇతర లాంచనాలు ఇచ్చి ఆమెను పుట్టింటి వారు కాపురానికి పంపించారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల కాలంలో మహేష్ చెడు వ్యసనాలకి బానిసై భార్య పద్మావతిని అదనపు కట్నం తీసుకురావాలంటూ శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కారు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. పలువురికి గాయాలయ్యాయి. వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాలు, తోపుడుబండ్లను ఢీకొట్టింది. దీంతో ప్రజలు పరుగులు తీశారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అమలాపురం తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అచ్చియ్యపాలెం శివార్లలో సీతానగరం ఎస్ఐ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 70 లీటర్ల నాటు సారా, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, బట్టీ నిర్వాహకులు ఎవరనేది దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అనుమానంతో భార్య హత్య

ప్రజాశక్తి - కాకినాడ

అనుమానం పెనుభూతమై భార్యను కత్తితో నరికి హత్య చేసిన ఘటన స్థానిక జగన్నాథపురంలో గురువారం చోటు చేసుకుంది. కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు జగన్నాథపురం పప్పుల మిల్లు ఏరియాలో బొంతల నూకరాజు, తన భార్య దివ్య ఇద్దరు పిల్లలతో కలిసి కాపురముంటున్నారు. నూకరాజు బిల్డింగ్ కాంట్రాక్ట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల కాలంలో భార్య దివ్యపై నూకరాజు అనుమానం పెంచుకున్నాడు. ఇదే విషయమై గురువారం ఉదయం నూకరాజు, దివ్యల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో నూకరాజు ఆగ్రహంతో ఇంట్లో వాషింగ్ మిషన్ పక్కన ఉన్న కత్తిని తీసుకుని ఆమెపై దాడి చేశాడు. కత్తి పోటుతో దివ్య భయంతో పరిగెడుతూ వచ్చి గేటు వద్ద కుప్పకూలి పోయింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని సిఐ సురేష్ బాబు పరిశీలించారు. నూకరాజును అదుపులోకి తీసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారు హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు మండలం కొత్తట గ్రామానికి చెందిన ఏనుగు అంజిబాబు (30) తాడేపల్లిగూడెం టిడిపి, జనసేన మహాసభకు వెళ్లి అక్కడి నుండి కొయ్యలగూడెం తన స్నేహితుడు ఇంటికి వెళ్లాడు. తిరిగి బైకుపై ఇంటికి వెళుతుండగా గోపాలపురం గ్రామ శివారు ఎన్‌హెచ్ రోడ్డులో హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టి ఆపకుండా వెళ్ళిపోయినట్లు తెలిపారు. తల వెనుక తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఏనుగు చక్రపాణి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మల్లేశ్వరరావుకు మల్లాడి పరామర్శ



మల్లేశ్వరరావును పరామర్శిస్తున్న మల్లాడి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సీనియర్ జర్నలిస్టు గుత్తుల మల్లేశ్వరరావు, అతని సోదరుడు సత్యనారాయణలను మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం పరామర్శించారు. మల్లేశ్వరరావు తండ్రి వెంకటేశ్వరరావు ఇటీవల అకాల మరణం చెందిన సంగతి విధితమే. ఈ సందర్భంగా వీరి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీనరసింహారాజు, కొల్లు వీరబాబు, సంగాడి రాజు, రాము, గ్రామస్తులు ఉన్నారు.

తోటకూర సోదరులకు ఆదిత్య శేషారెడ్డి పరామర్శ



తోటకూర సాయిరామకృష్ణతో మాట్లాడుతున్న శేషారెడ్డి

ప్రజాశక్తి - సామర్లకోట

మాతృవియోగంతో బాధపడుతున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ సోదరులను ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి గురువారం పరామర్శించారు. ఆయనతోపాటు టిడిపి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, వైసిపి నాయకులు తోట కూర వెంకటేశ్వరరావు, రమేష్, ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకులు కె.కాశీవిశ్వనాథ్, మోర్త శ్రీనివాస్, నీలం అర్జున్‌కుమార్, సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు కౌన్సిలర్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగ తాయారు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ వారానికి ఒకసారి జరిగే ప్రత్యేక పారిశుధ్య పనులు కూడా సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. కౌన్సిలర్ పప్పల దుర్గారావు మాట్లాడుతూ వాలుతిమ్మాపురం రహదారిలోని టిడ్కో గృహ సముదాయంలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అనేకచోట్ల డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆరేళ్ల వీరభద్రం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ గ్రాంట్ నిధులతో చేపట్టవలసిన అభివృద్ధి పనులు ఐదు నెలలుగా చేపట్టక పోవడం అన్యాయమన్నారు. విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆదాయవనరులు పెంచుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మెయిన్ రోడ్డులోని వినాయకుని గుడి వద్ద ఉన్న శిథిలావస్థ మున్సిపల్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి 3 సంవత్సరాలు గడిచినా ఈనాటికి నూతన భవన నిర్మాణం చేపట్టలేదని అన్నారు. దీనివల్ల లక్షలాది రూపాయల ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోయిందని అన్నారు. గడప రామలక్ష్మి మాట్లాడుతూ తన వార్డులో మంజూరైన అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు మాట్లాడుతూ పట్టణమంతా ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల నిర్మూలన పనులు చేపట్టున్నారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కెవి. పద్మావతి, డిఇఇ ఆదినారాయణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



వాలంటీర్లకు సర్టిఫికెట్ అందిస్తున్న జెసి ప్రవీణ్ ఆదిత్య

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - కాకినాడ

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సత్సంకల్పంతో రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని జెసి ప్రవీణ్ ఆదిత్య అన్నారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురువారం ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు సంభవించే సమయాల్లో తీసుకోవలసిన రక్షణ చర్యలపై ఓఎన్‌జిసి సహకారంతో సచివాలయ ఉద్యోగులు, రెడ్‌క్రాస్ ప్రాణమిత్ర వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలనే దృక్పథాన్ని ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. జీవన గమనంలో సేవ అన్నది ఒక అలవాటుగా మార్చుకోవాలన్నారు. ప్రధానంగా రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఎన్నో ప్రజాప్రయోజన ప్రాజెక్టులను అమలు చేస్తోందని అభినందించారు. ఓఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుపమ్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో రెడ్‌క్రాస్ ఎంతో సేవా స్ఫూర్తితో పని చేస్తోందని, ఆ సంస్థకు తమ వంతు తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడి.రామారావు మాట్లాడుతూ రక్తదాన శిబిరాలతోపాటు, వృద్ధాశ్రమాలు నిర్వహణ సహా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గోల్డ్‌మెడల్ కూడా సాధించామన్నారు. అలాగే రెడ్‌క్రాస్ సేవల్లో రాష్ట్రంలో కాకినాడ జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. శిక్షణ పొందిన ప్రాణమిత్ర వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

70 పుష్‌కార్ట్స్ సమకూర్చిన ఓఎన్‌జిసి

కాకినాడ నగరపాలకసంస్థ ప్రజారోగ్య విభాగానికి రూ.10 లక్షలు వ్యయంతో 70 పుష్‌కార్ట్‌లను ఓఎన్‌జిసి సంస్థ సమకూర్చింది. వీటిని జెసి ప్రవీణ్ ఆదిత్య నగరపాలక సంస్థకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రాణమిత్ర వలంటీర్లు పాల్గొన్నారు.

నెహ్రూని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు

ప్రజాశక్తి - జగ్గంపేట



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అప్పలరాజు

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూను విమర్శిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని సూర్యచంద్రను టిడిపి నాయకులు హెచ్చరించారు. గురువారం జగ్గంపేట టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ సూర్య చంద్ర గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో నెహ్రూ ను దూషిస్తూ చేసిన వ్యాఖ్యలను ఆయన సోదరుడు పాఠంశెట్టి బాబ్జి తీవ్రంగా ఖండించారు. ఎన్ఆర్ఐ ఫండ్స్‌ను సూర్యచంద్ర తినేశారంటూ వస్తున్న వీడియోలు వైరల్ అవ్వడంతో మనస్థాపం చెందినట్లు తెలిపారు. ఆమరణ నిరాహార దీక్ష విరమించి నెహ్రూను సపోర్ట్ చేయాలని ఆయన కోరారు. టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు మాట్లాడుతూ నెహ్రూ 40 ఏళ్ల రాజకీయంలో ఎంతో మందిని తయారు చేశారన్నారు అటువంటి వ్యక్తిని దూషించడం ఎంతవరకు సబబు అని సూర్యచంద్రను ప్రశ్నించారు. నెహ్రూ ద్వారానే రాజకీయాలకు వచ్చి ఆయన్ని దూషించడం సరి కాదన్నారు. పొత్తులో భాగంగా సీట్లు రాకపోవడం అనేది సహజమేనని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్‌కే ప్రకటించిన సీటునే మార్పు చేశారన్నారు. ఆయనే హుందాగా వ్యవహరించి పొత్తు ధర్మం పాటించారని గుర్తు చేశారు. పాఠంశెట్టి దంపతులు డిప్రెషన్‌లోకి వెళ్లారనిపిస్తుందని, ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి అని సూచించారు. అంతేగాని నెహ్రూపై వ్యక్తిగత దూషణలు సరికాదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కొత్త కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ వరుపుల ప్రచారం



ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న వరుపుల

ప్రజాశక్తి -శంఖవరం

మండలంలోని కొంతంగి, కొత్తూరు గ్రామాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, అలాగే ఎంపి అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్ పోటీలో ఉంటున్నారని, కావున ప్రజలు తమకు ఓట్లు వేసి గెలిపించి మరోసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పర్వత రాజుబాబు, మండల కన్వీనర్ నరాల శ్రీను, నడిగట్ల త్రిమూర్తులు, గింజలా కొండబాబు, కర్రి చిన్నా, తదితరులు పాల్గొన్నారు

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - సామర్లకోట



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న చినరాజప్ప

స్థాని భీమేశ్వర ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం సమీక్షా సమావేశం జరిగింది. ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. అయితే ఈ సమావేశానికి విధిగా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖలకు చెందిన అధికారులు పాల్గొనాల్సివుంది. అయితే ఇరిగేషన్, పోలీస్ శాఖలతోపాటు పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప, వైసిపి నాయకుడు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆలయ పుష్కరినిలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే పద్ధతి ఉన్నందున కోనేరులో పరిశుభ్రమైన గోదావరి జాలాలు నింపే బాధ్యత సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులపై ఉందన్నారు. అలాగే ఆలయం పరిసర ప్రాంతాల్లో అపారిశుధ్యం లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. బందోబస్తు విషయంలో పోలీసు అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా సంబంధిత శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, కౌన్సిలర్ నేతల హరిబాబు, కమిషనర్ జె.రామారావు, అగ్నిమాపక శాఖ అధికారి ప్రసాద్, ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని సిఐ లక్ష్మణరావు తెలిపారు. పట్టణ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి అదుపులోకి తీసుకున్న వారిని పెద్దాపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచామన్నారు. నలుగురు వ్యక్తులకు మూడు రోజులు జైలు శిక్ష విధించగా, మరో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున న్యామూర్తి జరిమానా విధించారన్ని సిఐ తెలిపారు.

దంతాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో దంతాల సంరక్షణ మరియు పరిశుభ్రతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెజెసిఎల్.స్వరూప దంత సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ మాట్లాడుతూ దంతాల యొక్క పరిశుభ్రత చాలా అవసరమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూపను సత్కరించారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి - సామర్లకోట



భీమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్నతహశీల్దార్

సామర్లకోట తహశీల్దార్‌గా పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం భీమేశ్వరాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్ల, పెద్దాపురం ఆర్‌డిఒ సీతారామారావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం డిఎస్‌పి కె.ప్రమోద్, విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి డాక్టర్ ప్రమోద్ కుమార్ పాల్గొని విజ్ఞాన శాస్త్రం యొక్క గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ సీన్, క్విజ్, డ్రాయింగ్, షార్ట్ ఫిలిం పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ విలాస్ అనిల్ చవాన్, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వర రావు, మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపల్ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కుకు ఎంతో విలువ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని, ఆ ఓటును సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిభావణి అన్నారు. స్థానిక పెంకేవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఎన్నికల ఓటింగ్ విధానంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలో ఓటింగ్‌పై అవగాహన కల్పించేలా తల్లులతో రంగవల్లులు వేయించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడతూ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రజలందరూ ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమ సమాజం ఏర్పడాలంటే రాబోయే ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

లిబరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం



ప్రదర్శన నిర్వహిస్తున్న లిబరేషన్ కార్యకర్తలు

వచ్చే ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని నిలువరించి లౌకికవాద ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కోరుతూ ర్యాలీ జరిగింది. సిపిఐ (ఎంఎల్)లిబరేషన్ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బుగతా బంగార్రాజు మాట్లాడుతూ దళితులకు, గిరిజనులకు, రైతులకు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పేదలకు ఉపయోగకరమైన ఉపాధి హామీ పథకంను ఎత్తేసేందుకు కుట్రలు సాగిస్తుందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రహస్య విధానాన్ని అమలు పరుస్తూ దేశంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నారన్నారు. స్థానిక రెబరేషన్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ సెంటర్, పెద్ద వీధి, పోలీస్‌స్టేషన్ మార్కెట్ వీధి మీదుగా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్‌రావు, నాయకులు కె.జనార్ధన్, ఎం.లచ్చబాబు, ఆర్.సింహాచలం, కె. రత్నకుమారి, టి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి

బాలికలను రక్షించాలని ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా 450 మంది ఆడపిల్లలతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఆడపిల్లలను రక్షించాలని, వారిని చదివించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, ఎడిపిసి కమిడి ప్రభాకర్, పాము సత్యనారాయణ, సిఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగన్, నూకరాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై యూత్ పార్లమెంట్



యూత్ పార్లమెంటులో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. జాతీయంగా, స్థానికంగా ఉన్న సమస్యలపై యువత ఆలోచన విధానం, పరిష్కరించుకునే విధానం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై చర్చ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై యూత్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, అధ్యాపకులు చెల్లి నరేష్, తిరికోటి సుబ్బలక్ష్మి, కళాశాల సిబ్బంది, వాలంటీర్లు, యువత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారించాలని ఆందోళన

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఏలేశ్వరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.ఫిలిప్‌రాజు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో మంజూరు కావడం లేదని, బకాయిలు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నదని తెలిపారు. తక్షణమే ఆర్థిక పరమైన అంశాలను పరిష్కరించాలని, అలాగే ఉపాధ్యాయుల నియామ కంలో ప్రవేశపెట్టిన అప్రెంటిస్ విధానం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విటియు ఆచార్యులు, పి సత్తిబాబు, ఎన్ఎల్ఎన్.రాజు, పిఎస్.వాణి, ఆర్ఎస్.రాజు, కె.సత్యవతి, ఆర్ కుమారి, ఎ.లలిత పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం తహశీల్దార్ కార్యాల యం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యంతర పిఆర్‌సి కింద 30 శాతం చెల్లించాలని, ఒపిఎస్ విధానం కొనసాగించాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బి.సత్యప్రసాద్, డి.ఎ.రాజశేఖర్, శ్రీరామ్, ఎ.సురేష్, కెసి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.